ప్రజాశక్తి

బుధవారం 19 జూన్ 2024

5

పార్వతీపురం మన్యం



ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా ఫస్ట్ ర్యాంక్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని డిఐఇఒ మంజుల వాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1,709 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వీరిలో 1,443 మంది ఉత్తీర్ణత సాధించారు. 84 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. అలాగే విజయనగరం జిల్లాలో 6,685 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 4,570 మంది ఉత్తీర్ణత సాధించారు. 68 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచిందని తెలిపారు.

వాలంటీర్లు, ఫీల్డు అసిస్టెంట్లలో గుబులు

- తమకు అవకాశం కల్పించాలంటున్న తెలుగు తమ్ముళ్లు
- గతంలో జీవనోపాధిని దెబ్బతీశారంటూ మరికొందరు
- గ్రామ స్థాయిలో సిద్ధమవుతున్న జాబితాలు
- ఎమ్మెల్యేలకు, అధికారులకు విజ్ఞాపనలు

తమను కొనసాగించాలని కలెక్టర్‌కు వినతినిచ్చేందుకు వచ్చిన వాలంటీర్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇప్పుడే కాదు... కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు, పాలకులు చూపిన పక్షపాత వైఖరి, కక్షసాధింపు చర్యలు, బంధుప్రీతితో గ్రామ స్థాయిలోని గ్రామ వాలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశావర్కర్లు నలిగిపోతున్నారు. ఇటీవల ప్రభుత్వం మారడంతో కొందరి గుండెల్లో గుబులు మొదలైంది. ప్రతి ఐదేళ్లకోసారి ఇటువంటి దుస్థితి ఉంటోంది. జిల్లాలో ఈసారి మరీ ఎక్కువగానే కనిపిస్తోంది.

గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతి 50 ఇళ్లకు ఓ వాలంటీర్ చొప్పున నియమించారు. మన్యం జిల్లా వ్యాప్తంగా ఉన్న 350 వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో 5340 మంది వాలంటీర్లను నియమించి, వారికి రూ.5వేల చొప్పున పారితోషికం చెల్లిస్తున్న సంగతి తెలిసిందే. అప్పట్లో కొన్ని గ్రామాల్లో మినహా మిగిలిన అన్నిచోట్లా వైసిపి కార్యకర్తలనే వాలంటీర్లుగా నియమించారు. వీరిని ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దంటూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేయడంతో వైసిపి ప్రభుత్వం నాలుక కొరుక్కుంది. పార్టీ కోసం వాలంటీర్లంతా రాజీనామాలు చేసి వైసిపి గెలుపునకు కృషి చేయాలంటూ అప్పట్లో జగన్ ప్రభుత్వం చెప్పింది. జగన్ పిలుపే తడువుగా 'మాంసం తిన్నామంటూ దుమ్ములు మెడలో వేసుకున్న చందంగా' జిల్లా వ్యాప్తంగా 2800 మంది రాజీనామాలు చేశారు. ఇటీవల టిడిపి ప్రభుత్వం మారడంతో తమను తొలగించి, టిడిపి కార్యకర్తలను పెట్టుకుంటారనే భయం చాలా మంది వాలంటీర్లలో వ్యక్తమౌతోంది. అందుకు తగ్గట్టే 'రాజీనామా చేయని వాలంటీర్లందర్నీ కొనసాగిస్తాం' అంటూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఓ కార్యక్రమంలో మంగళవారం ప్రకటించారు. దీంతో, జిల్లాలోని మెజార్టీ వాలంటీర్లలో ఆందోళన నెలకొంది. ఈనేపథ్యంలోనే కురుపాంతో పాటు మరికొన్ని మండలాలకు చెందిన వాలంటీర్లు రాజీనామా చేసిన తమను కొనసాగించాలని కోరుతూ అధికారులకు వినతినిచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. వాలంటీర్ల నియామకాల్లో పేదలని చూడకుండా వైసిపిలో ఉన్నవారికి మాత్రమే ఇచ్చారనేది గ్రామ స్థాయి టిడిపి నాయకుల వాదన. నిరుపేదలకు కూడా అవకాశం ఇవ్వలేదని వారు ఆరోపిస్తున్నారు.

అలాగే ఉపాధి హామీలో పనిచేస్తున్న మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లలో చాలా మందిపై గత ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడింది. దీంతో పలువురు కోర్టులకు కూడా వెళ్లినట్టుగా సమాచారం. కొమరాడ మండలం కోటిపాం జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన కార్మికులను కూడా ఇలాగే అర్థాంతరంగా తొలగించారు. ఇవి మచ్చుకు మాత్రమే జిల్లా ఎంతో మంది గత ప్రభుత్వ హయాంలో వేధింపులతో జీవనోపాధి కోల్పోయారు. వీరంతా ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో తమను ఆదుకోవాలంటూ ఎమ్మెల్యే, మంత్రులకు విన్నపాలు చేస్తున్నారు. మరోవైపు ఇలాంటి సమస్య లేనిచోట కూడా తమ కోసం పనిచేసినవారికి ఏదో ఒకటి చేయాలనే తలంపుతో చాలా కాలంగా పనిచేస్తున్న మేట్‌లను, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను మార్పుచేసేందుకుతహతహలాడు తున్నారు. ఈ మేరకు గ్రామాల్లో పార్టీల ప్రాతిపదికన జాబితాలు తయారు చేసి స్థానిక ఎమ్మెల్యేలకు ఇచ్చేందుకు సన్నద్ధమౌతున్నారు. మరోవైపు ఇప్పటికే ప్రభుత్వ మద్యంషాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది తమను కొనసాగించాలంటూ ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతులు ఇస్తున్నారు. వారిలో కూడా తొలగిస్తారేమోనన్న ఆందోళన నెలకొంది.

మంచం పట్టిన మన్యం

పెరుగుతున్న జ్వర పీడితులు
రోజువారీ ఓపి 150 వరకు నమోదు

ఒకే మంచంపై చికిత్స పొందుతున్న రోగులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలం వచ్చిందంటే చాలు ప్రతి ఏటా గిరిజన ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. ముఖ్యంగా మలేరియా, వైరల్ జ్వరాలతో బాధపడుతూ వైద్యం కోసం ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. రోజువారి ఒపి 150 నుండి 200 వరకు నమోదవుతున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. గిరిజన గ్రామాల్లో ఒకవైపు మలేరియా నివారణకు ఎసిఎం పిచికారీ చేపడుతున్న మరోవైపు మలేరియా జ్వర పీడితులు పెరుగుతున్నారు. భద్రగిరి ఆసుపత్రిలో ఒకే మంచంపై ఇద్దరేసి రోగులకు వైద్యం అందిస్తున్నారు. గ్రామాల్లో కలుషిత నీరు, అపారిశుధ్య వాతావరణం కారణంగా దోమలు వ్యాప్తి చెందడంతో గిరిజనులు విషజ్వరాల బారిన పడుతున్నారు. వైద్య సేవల కోసం రోగులు పెద్ద సంఖ్యలో రావడంతో క్యూలో నిరీక్షించాల్సి వస్తోంది. గర్భిణులు, యాక్సిడెంట్ కేసులు కూడా నమోదవుతున్నాయి. లోవ ముఠా లోని 10 పంచాయతీల్లో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో దుడ్డు ఖల్లు, రేగిడి పిహెచ్‌సిలను ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో కూడా మలేరియా బాధితుల సంఖ్య ప్రతి ఏడాది పెద్ద సంఖ్యలో నమోదవుతుంది. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు జ్వరాల బారిన పడుతూ మృతి చెందిన సంఘటనలు ప్రతి ఏటా చోటు చేసుకుంటున్నాయి. వీటిపై ఐటిడిఎ అధికారులు దృష్టి సారించి మెరుగైన సేవలందించాలని తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

దోమతెరలు పంపిణీ చేయాలి

గ్రామాల్లో గిరిజనులకు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం తక్షణమే దోమ తెరలను పంపిణీ చేయాలి. మూడేళ్లుగా దోమ తెరల పంపిణీ కార్యక్రమం చేపట్టలేదు. దోమతెరల వాడకంతో మలేరియా దోమ కాటు నుంచి రక్షణ పొందడానికి కొంత వీలుంటుంది. గ్రామాల్లో మలేరియా మందులు అందుబాటులో ఉంచాలి.

మండంగి రమణ,
సిపిఎం నాయకులు, గుమ్మలక్ష్మీ పురం,

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో వ్యాధుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా వైద్య శిబిరాలు నిర్వహించి సేవలందించాలి. ఆసుపత్రుల్లో అన్ని రకాల సౌకర్యాలు, మందులు అందుబాటులో ఉంచాలి.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి .

మోటూరు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వేణు

ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలి
మోటూరుకు ఘన నివాళి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకుపోవడానికి కృషి చేయడమే మోటూరు హనుమంతురావుకు మనం ఇచ్చే ఘనమైన నివాళని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకులు, సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మోటూరు హనుమంతురావు 23వ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో ఎంహెచ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో 1937లో సభ్యునిగా చేరిన ఆయన ఆ తర్వాత సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యునిగా పని చేశారని వివరించారు. తొలుత మితవాదంతో, ఆ తర్వాత అతివాదులతో రాజకీయ, సైద్ధాంతక విభేదాలు తలెత్తినప్పుడు నికరంగా నిలిచిన మార్క్సిస్టు ఆయనన్నారు. ఎమ్మెల్యేగానూ, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యునిగా చట్టసభల్లో కూడా సేవలందించారని తెలిపారు. ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మధరావు, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, పట్టణ కమిటీ సభ్యులు బి.సూరిబాబు, ఎస్.ఉమామహేశ్వరావు, పి.రాజశేఖర్, ఎం.వెంకటరమణ, డి.పండు, కె.గంగారాం పాల్గొన్నారు.

21న జాబ్ మేళా

విజయనగరంకోట: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు అపోలో టైర్స్ , మోడలేజ్ ఇండియా ఫుడ్ ప్రైవేటు లిమిటెడ్, పాపులర్ షూ మార్టలలో 240 ఉద్యోగ ఖాళీలకు ఈనెల 21న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి. అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం తుపాకుల వీధిలో గల ఎం.ఆర్ కళాశాల వద్ద ఈనెల 21 న ఉదయం 10 గంటలకు అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు.

మాది రైతు సంక్షేమ ప్రభుత్వం

నకిలీ విత్తనాల విక్రయాలపై చర్యలు
సబ్సిడీ విత్తనాల పంపిణీ చేసిన మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం ఏర్పడిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పిఎం కిసాన్ యోజనా కింద మంజూరైన 2వేల రూపాయల మొత్తాన్ని ఆమె రైతుల ఖాతాల్లోకి జమ చేశారు. అనంతరం రైతులకు సబ్సిడీ పై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటిలాగే రైతులకు సబ్సిడీపై విత్తనాలను, పని ముట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడానికి కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. సకాలంలో రైతులకు డబ్బులు అందేలా చూస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పంటలు కొనుగోలు చేయాలని రైతులతో కలిసి ఆందోళన చేస్తే తనతో పాటు కొంతమందిపై కేసులు పెట్టినట్లు తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయాలపై వ్యవసాయ శాఖ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

అధికారులు నిఘా పెట్టాలని ఆదేశించారు. ఒకవేళ నకిలీ విత్తనాల విక్రయాలు నిజమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైనప్పుడు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా విడుదల చేయనున్నట్లు చెప్పారు. తాను స్థానికంగా వున్నా లేకపోయినా రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీటిని అధికారులే విడుదల చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్, ఎడి మధుసూదనరావు, ఎఒ అనురాధ పండా, మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, సీనియర్ నాయకులు పప్పల మోహన్, కూనిశెట్టి భీమా రావు, ముఖీ సూర్యానారాయణ, యుగంధర్ పాల్గొన్నారు.

పిఎం కిసాన్ కింద రూ.22.77 కోట్లు

పిఎం కిసాన్ పథకం కింద జిల్లాలో 113865 మంది రైతులకు రూ.22.77 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. పి ఎం కిసాన్ నిధులను ప్రధాన మంత్రి మంగళ వారం వీడియో కాన్ఫరెన్స్ విధానంలో జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

విజయనగరం కోట : గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి, తాగు, సాగునీరు అందించే విధంగా కృషిచేస్తానని గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ప్రజలకు సేవ చేసి వారి రుణం తీర్చుకుంటానని తెలిపారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో ఎఎన్ఎంల నియామకంపైనే తన తొలి సంతకం చేశానని చెప్పారు. మంగళవారం జిల్లా టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాకు వచ్చిన ఆమెకు ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, టిడిపి నాయకులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గిరిజన విద్యార్థులు మరణాలను అరికట్టేందుకు ప్రతి హాస్టల్‌లోనూ ఒక ఎఎన్ఎంను నియమిండ చేందుకు తొలి సంతకం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోను,జిల్లాలోను గత ఐదేళ్లలో ఐటిడిఎలను నిర్లక్ష్యం చేశారని, ఫీడర్ అంబులెన్స్‌లు లేక గిరిజనులకు డోలి కష్టాలు తప్పలేదని అన్నారు. గత ఐదేళ్లలో జరిగిన ప్రతి అక్రమంపైనా విచారణ చేయిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ సమిష్టి కృషితో జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, పిల్ల విజయ్ కుమార్ , కాళ్ల గౌరీ శంకర్, కంది మురళి నాయుడు, బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

వరహాల గెడ్డపై ఆక్రమణలను చూపుతున్న సిపిఎం నాయకులు

ఆక్రమణలపై దర్యాప్తు జరిపించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని వరహాలగెడ్డ, చెరువుల ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం పట్టణకమిటీ నాయకులు గొర్లి వెంకటరమణ, సంచాన ఉమామహేశ్వరరావు, బంకురు సూరిబాబు మంగళవారం వరహాల గెడ్డపై నిర్మిస్తున్న కల్వర్టు పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలో కొద్దిపాటి వర్షం కురిసినా ప్రధాన రహదారి ముంపుబారిన పడుతుందన్నారు. దీనికి ప్రధాన కారణం వరహాలగెడ్డ ఆక్రమణలేనన్నారు. ఈ ఆక్రమణల తొలగించాలని అధికారులకు పలుమార్లు వినతులు ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అలాగే వరహాల గెడ్డపై నిర్మిస్తున్న కాజ్‌వే పనులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం వరహాలగెడ్డ ఆక్రమణపై ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రంను అందజేశారు.

ఆర్‌డిఒకు కాంగ్రెస్ వినతి

పార్వతీపురంరూరల్ : పట్టణంలోని వరహాలగెడ్డలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జ్ బత్తిన మోహన్‌రావు ఆర్‌డిఒ కె.హేమలతకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో ఇటువంటి ఆక్రమణలు చాలా ఉన్నాయని, వీటిపై అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాలను, చెరువులను పరిరక్షించాలని కోరారు. వరహాలగెడ్డ అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపివేయించాలన్నారు. వినతిని అందజేసిన వారిలో నాయకులు పట్ల సింగ్ రవికుమార్, తీళ్ల గౌరీ శంకర్, మీసాల సురేష్ తదితరులు ఉన్నారు.

కొత్తవారిని నియమిస్తారా? పాతవారిని కొనసాగిస్తారా?

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ప్రకటనతో హర్షం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమిస్తామని కొత్తగా బాధ్యతలు చేపట్టిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రకటనతో విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాణస్వీకారం తర్వాత మొదటి సంతకం విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం శ్రద్ధ వహిస్తూ ఆరోగ్య కార్యకర్తల నియామకానికి హామీ ఇవ్వడం పట్ల గిరిజన నాయకులు అభినందిస్తున్నారు. అయితే పాత వారినే కొనసాగిస్తారా లేదా కొత్త వారిని నియమిస్తారా అనే ప్రశ్న వినిపిస్తోంది. మంత్రి ప్రకటనతో గతంలో పనిచేసిన

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు (ఫైల్)

ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిలో ఆశలు చిగురించాయి. ఐటిడిఎల పరిధిలో పనిచేస్తున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఉంటున్న గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశ్యంతో టిడిపి హయాంలో ఆదివాసీ ఆరోగ్యం పేరుతో థర్డ్ పార్టీ ద్వారా ఔట్ సోర్సింగ్‌పై ఆరోగ్య సిబ్బందిని నియమిం చారు. ఉమ్మడి జిల్లాల్లో ఐటిడిఎ పరిధిలో 55 ఆశ్రమ పాఠశాలలు, 17 కళాశాల వసతి గృహాలు ఉన్నాయి. వీటి పరిధిలో 163 మంది సిబ్బంది పని చేశారు. ఇందులో హెల్త్ కోఆర్డినేటరులు పది మంది, ఒక వైద్యాధికారి, ఆశ్రమ పాఠశాలల్లో 87 ఎఎన్ఎంలు, గురుకులంలో నలుగురు, పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో 16, హాస్పిటల్లో 13, జెడ్పి పాఠశాలలో 43విధులు నిర్వహించేవారు. విద్యార్థికి అనారోగ్యం వాటిల్లితే వెంటనే వైద్యం అందించేవారు. సీరియస్ కేసులను పార్వతీపురం, విజయనగరం, విశాఖ వంటి దూర ప్రాంత ఆసుపత్రికి తరలిస్తే అక్కడ ఉన్న ఆరోగ్య సిబ్బంది విద్యార్థిని రిసీవ్ చేసుకుని ఉన్నత వైద్యం అందించేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండేళ్లపాటు కొనసాగించి ఆ తర్వాత వీరిని విధుల నుంచి తొలగించింది. దీంతో విద్యార్థులకు వైద్య సేవలు సక్రమంగా అందకపోవడంతో ప్రతి ఏటా విద్యార్థుల మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. ఆరోగ్య కార్యకర్తలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎన్నో సార్లు ఐటిడిఎ, కలెక్టరేట్, విజయవాడలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. ప్రస్తుతం వసతి గృహ సంరక్షకులు ఆరోగ్య కార్యకర్తలను నియమించి తమ జీతంలో కొంత మొత్తాన్ని చెల్లిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతోనైనా ఆశ్రమ పాఠశాలల్లో ఆదివాసీ ఆరోగ్య కార్యకర్తలను తిరిగి నియమించి విద్యార్థులకు స్థానికంగా వైద్యం అందిస్తే మరణాల నివారణకు అవకాశం ఉంటుందని గిరిజన సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

పాతవారినే కొనసాగించాలి

టిడిపి హయాంలో పనిచేసిన ఔట్సోర్సింగ్ ఆరోగ్య సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకుని ఉపాధి కల్పించాలి. ఆరోగ్య సిబ్బందిని నియమించడం ద్వారా విద్యార్థులకు స్థానికంగా మెరుగైన వైద్యం అందించడానికి వీలుంటుంది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ప్రకటనతో సాధ్యమైనంత త్వరగా ఆరోగ్య సిబ్బందిని నియమించాలి.

పల్లా సురేష్ , గిరిజన
విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు

ఎఎన్ఎం నియామకాలపై హర్షం

సీతంపేట : ఆశ్రమ వసతి గృహాల్లోనూ, పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో ఎఎన్ఎం నియామకాలపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తొలి సంతకం పెట్టడం సంతోషకరమని పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వసతి గృహాల గిరిజన సంక్షేమం రాష్ట్ర అధ్యక్షులు బిడ్డిక రామ్మోహన్ రావు హర్షం వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం చాలా సంతోషకరమన్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ పోస్టులు భర్తీ కాలేదన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఏరియా ఆస్పత్రిని పరిశీలిస్తున్న మలేరియా జోనల్ అధికారి శాంతికుమారి

గిరిజన గ్రామాల్లో జోనల్ అధికారి పర్యటన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పొల్లరేయి, మానుగూడ, టిటికిపాయి, మానాపురం తదితర గిరిజన గ్రామాల్లో మలేరియా జోనల్ అధికారి శాంతికుమారి మంగళవారం సందర్శించారు. మలేరియా కేసులు అధికంగా ఉండడంతో తనిఖీలు చేపట్టారు. కాలువలు శుభ్రపర్చాలని సంబంధించిన సిబ్బందికి ఆదేశించారు. మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాలన్నారు. అలాగే అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సీతంపేట ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. మలేరియా కేసులపై సకాలంలో వైద్యసేవలందిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావును అభినందించారు. గత ఏడాది ఈ ప్రాంతంలోనే మలేరియా కేసులు అధికంగా వచ్చాయన్నారు. కావున హైరిస్క్ గ్రామాల్లో మలాథియన్ పిచికారీ తప్పనిసరిగా చేయాలన్నారు.

దర్గాను దర్శించిన మంత్రి కొండపల్లి

విజయనగరం : నగరంలోని బాబామెట్టలోగల సూఫీ పుణ్య క్షేత్రం హజరత్ సయ్యద్ ఖాదర్ వలీ దర్గాను రాష్ట్ర సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస దర్శించుకున్నారు. ఆయనకు ఖాదర్ వలీ బాబా దర్గా, దర్బార్ షరీఫ్ ధర్మకర్త(ముతవల్లి) డాక్టర్ ముహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ(ఖలీల్ బాబు) స్వాగతం పలికారు.

కొమరాడలో వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

వాహన తనిఖీకి రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - పాలకొండ/కొమరాడ

జిల్లా రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.రమేష్ కుమార్, జి.సత్యనారాయణ, బి.కాశీరాం నాయక్ కొమరాడ మండలంలోను, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.వేణుగోపాలరావు పాలకొండ మండలంలో ప్రత్యేక డ్రైవ్ మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. మోటార్ వాహన చట్టంపై అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువ పత్రాలు ఉండాలని, హెల్మెట్ ధరించాలని వారు పేర్కొన్నారు. రహదారి భద్రత నియమనిబంధనలు విధిగా పాటించాలని, వాహనాలను కండిషన్‌లో నడపాలని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానికి భారీగా జరిమానా పడుతుందన్నారు. ఆటోల్లో సంఖ్యకు మించి ఎక్కించరాదని, సరుకు రవాణా వాహనాల్లో మనుషులను ఎక్కించరాదని, అధిక బరువు వేయరాదని పేర్కొన్నారు. సురక్షిత ప్రయాణానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

వీరేష్‌ను సన్మానిస్తున్న ఎంపిడిఒ, సచివాలయ సిబ్బంది

వీరేష్‌ను కలిసిన సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేష్ చంద్రదేవ్‌ను కురుపాంలోని తన కోట వద్ద మంగళవారం ఎంపిడిఒ ఎస్.అప్పారావు, సచివాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుస్సాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి బి.అనిత, విఆర్ఒ స్వరాజ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వాలంటీర్లు వినతి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో పనిచేస్తున్న వాలంటీర్లుగా రాజీనామా చేసిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎంపిడిఒ ఎస్.అప్పారావుకు ఎంపిడిఒ కార్యాలయం వద్ద మంగళవారం వాలంటీర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము స్వచ్ఛందంగా రాజీనామా చేయలేదని, బలవంతంగా రాజీనామాలు చేయించారని, కావున ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తమను విధుల్లోకి తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు వాలంటీర్లు పాల్గొన్నారు.

యు.వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేటలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో నేడు ఎంపిపి సమావేశం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఎట్టకేలకు ఎంపిపి బొంగు సురేష్ మండలంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. వైసిపి తరపున ఎంపిపిగా గెలుపొందిన ఆయన అదే పార్టీ తనను పక్కన పెట్టడంతో టిడిపిలో చేరి మండలంలో ఆ పార్టీ గెలుపునకు కీలకపాత్ర వహించారు. వైసిపి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి తనను రాజకీయంగా ఎంత కిందికి తొక్కాలనుకున్నారో ఆమెపై అంతే తీవ్ర విమర్శలు చేసి చివరకు సురేష్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఇదే కారణంతో గత ఏడాది మండలం పరిషత్ కార్యాలయంలో ఏం జరుగుతుందో చూడని ఎంపిపి నేటి సమీక్షా సమావేశంలో ఇకపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని అధికారులు ఒకింత ఆందోళనకు గురవుతున్నారు. ఇంతవరకు దిశ,నిర్దేశం లేని స్థానిక మండల పరిషత్ గాడిలో పడుతుందని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

వాబలో జిపిఎస్ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని వాబలో గల జిపిఎస్ పాఠశాలను డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టిన పరిశీలిచారు. మధ్యాహ్నం భోజనం పథకాన్ని సందర్శించి, భోజనం చేశారు. విద్యార్థులకు డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు ఆటపాటలతో పాఠాలు బోధించాలన్నారు.

శత శాతం అడ్మిషన్లు జరగాలి

బడికి పోతా కార్యక్రమంలో భాగంగా 100శాతం ప్రవేశాలు జరగాలని ఐటిడి ఉప విద్యాశాఖాధికారి పాలక నారాయుడు అన్నారు. మండలంలోని శంభాం పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. బడి ఈడు పిల్లలు బడి బయట ఎవరూ ఉండకూడదన్నారు. స్టూడెంట్స్ కిట్ అందరికీ అందేలా చూడాలని, డ్రాప్ అవుట్ స్టూడెంట్స్‌ను గుర్తించి మళ్లీ బడిలో చేర్పించాలని, పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండాలని తెలిపారు. ఆర్ఒ ప్లాంట్లు పనిచేయాలన్నారు. విద్యార్థులకు తాగునీరు విషయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం హెచ్ సుందర్రావు తదితరులు ఉన్నారు

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో మెయిన్ రోడ్‌లో విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. మైనర్లు టూవీలర్స్ లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిస అవ్వొద్దని హెచ్చరించారు.

సీతంపేట : వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై ఎం.జగదీష్ నాయుడు అన్నారు. మంగళవారం మోటార్ వెహికల్‌కు సంబంధించిన డ్రైవర్లు ప్రజలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఓవర్ లోడ్ వేయరాదని, మితిమీరిన వేగం వెళ్లరాదని సూచించారు. మైనర్లకు వాహనాలిస్తే సంబంధిత బాధ్యులపై చర్య తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఘాట్ రోడ్‌ల ఫిట్నెస్ ఉన్న వాహనాలు నడపాలని అవగాహన కల్పించారు.

వాహనచోదకుడికి సూచనలు చేస్తున్న పాలకొండ ఎస్ఐ ప్రశాంత్‌కుమార్

నాసిరకం రోడ్లు... చిన్నపాటి వర్షానికే కోతలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పలు గ్రామాల్లో వేసిన రోడ్లు నాసిరకంగా నిర్మించడంతో ఇటీవల కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే పూర్తిగా పాడైపోయాయి. ఈ మేరకు సిపిఎం బృందం కోతకు గురైన రోడ్లను మంగళవారం పరిశీలించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాసరావు, నాయకులు జర్సీ వెంకట్రావు, డప్పు శ్రీనివాసరావు, బాబ్జీ కోతకు గురైన రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని నందేడవలస నుండి కేరంగికి వెళ్లే రహదారి మెలియా, కాంచూరు, తుమరవల్లి, నూరువలాలపాడు, గుమ్మిడిగూడ, శాపాలి సికు సింత, కటారికోట, రోడ్డువలసకు మీదుగా నరేంద్రపాడు వరకు వెళ్లే రోడ్డు వర్షానికి పూర్తిగా పాడైపోయాయన్నారు. ఈ రోడ్ల నిర్మాణాలకు వెచ్చించిన ఎస్సి, ఎస్టి నిధులు సక్రమంగా ఖర్చు చేయకపోవడంతో ఇటువంటి నాశిరకమైన రహదారుల వల్ల చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత గిరిజన శాఖామంత్రి సంధ్యారాణి స్పందించి తన సొంత నియోజకవర్గంలోని ఈ రోడ్లపై సమగ్ర దర్యాప్తు చేసి నాణ్యత ప్రమాణాలతో కూడిన రహదారులు నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు. అలాగే మండలంలోని అన్ని రోడ్లు గిరిజన ప్రాంతాల్లో ఉన్న రోడ్లన్నింటిపైన సమగ్ర దర్యాప్తు చేసి సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టాలని కోరారు.



కోతకు గురైన రోడ్లను చూపుతున్న సిపిఎం నాయకులు

బకాయి జీతాలు చెల్లించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వినతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి 17 నెలల నుంచి బకాయి ఉన్న గౌరవ వేతనం తక్షణమే చెల్లించాలి ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజుకు సిబ్బంది మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న తమకు 17 నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడం కుటుంబాల పోషణ కష్టంగా ఉందన్నారు. అలాగే పిల్లల విద్య, వైద్య ఖర్చులు కూడా పెరిగాయని, ఇస్తున్న కొద్దిపాటి గౌరవ వేతనం కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముఖ రాజును అడిగితే వారం రోజుల్లో గౌరవ వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేయాలని, లేని పక్షంలో నిరసన తెలియ చేస్తామని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిని ప్రాజెక్ట్ మేనేజర్‌కు అందజేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, కోశాధికారి గొర్లె వెంకటరమణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి తక్షణమే వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. వీరి న్యాయమైన పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రసాదు, లక్ష్మణరావు, శ్రీరాములు, రామారావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు



ప్రాజెక్టు మేనేజర్‌కు వినతిని అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కేన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ ఇస్తు్న ప్రాజెక్టు ప్రతినిధులు

కేన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమానికి సిబ్బందికి అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ, ఎన్‌సిడి ప్రాజెక్ట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింగరావు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా ఆసుపత్రి సమావేశ మందిరంలో నెలరోజుల పాటు నిర్వహించనున్న కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గల వైద్యాధికారులకు, స్టాఫ్‌నర్స్‌లకు, ఎఎన్ఎంలకు బ్యాచ్‌కి 50మంది చొప్పున మూడురోజులపాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం నెలరోజుపాటు కొనసాగుతుందన్నారు. నోటి కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్ మొదలకు కేన్సర్లను స్క్రీనింగ్ చేయుట, పరీక్షించుట, రిఫర్ చేయుడం, ఫాలో అప్ చేయడం, ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను తొలగించడం, వ్యసనాలు, జీవనశైలి, ఆహారపు అలవాట్ల ప్రభావం, నైపుణ్య శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, పిఒ ఆర్బిఎస్కె డా. పిఎల్‌రఘుకుమార్, డాక్టర్ శ్యామల పాల్గొన్నారు.

ప్రజారోగ్యం పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలో ప్రస్తుతం వ్యాధుల సీజన్ ప్రారంభం కావడంతో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉంటూ మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జగదీష్ తెలిపారు. ఇటీవల మలేరియా పాజిటివ్ కేసులు రావడంతో గిరిజన గ్రామాలైన అలమండ, వనిజ, అర్నాడ తదితర గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి తగినన్ని మందులు ఇస్తూ మరోపక్క ఎంపిడిఒ శ్రీనివాసరావుతో మాట్లాడి ఆయా గ్రామాల్లోని శానిటేషన్, తాగునీరు మొదలైన అంశాలపై ప్రత్యేక శ్రద్ధను వహిస్తున్నామని ఆయన తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటూ స్థానిక ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య ఉత్పన్నమైన వెంటనే తనకు తెలియజేయాలని, అవసరమైన చోట రోగికి తనతో పాటు ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం ఉందని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ బి.హైమావతి, ఎస్.శ్రీనివాసరావు సిబ్బంది పద్మావతి, నారాయణరావు, రాజేష్ భూషణ, అమల కుమారి, అనూష తో పాటు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

2024 ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో టిడిపి గెలుపునకు సహకరించిన ప్రతి జనసేన కార్యకర్తకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆ నియోజకవర్గం నాయకులు చేడిక గౌరీ శంకర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రానున్న కాలంలో కురుపాం నియోజకవర్గంలో గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. సాగు నీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, తాగునీరు వంటి సమస్యలను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. అలాగే గిరిజన యువతకు ఉపాధి కల్పన చర్యలు, పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

శస్త్రచికిత్సకు పయనమై వెళ్తున్న రోగులు

నేత్ర చికిత్సకు తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల సచివాలయాల పరిధిలో ఇటీవల జరిగిన ఆరోగ్య సురక్ష కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నేత్ర పరీక్షలు నిర్వహించిన సమయంలో కేటరాక్ట్ (అంతర కుసుమం), టేరిజియం(కొయ్యకండ) సమస్యలు గుర్తించి వారిని శస్త్ర చికిత్సలు కోసం మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి విశాఖ జిల్లా తగరపువలస ఎన్ఆర్ఐ కంటి ఆసుపత్రికి తరలించినట్లు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. శస్త్ర చికిత్సలు చేసుకున్న వారందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందుల సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు రమేష్, మాలిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో సాగు నీరివ్వాలి : ఎంపిపి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రానున్న ఖరీఫ్‌కు సకాలంలో సాగునీరందించాలని ఎంపిపి ఉరిటి రామారావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఇటీవల జరిగిన రీసర్వేలో లోపాలను రెవెన్యూ అధికారులు సరిదిద్దాలన్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహశీల్దార్ పి.సత్యలక్ష్మికుమార్ మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించి ఇటీవల మంజూరైన పాసు పుస్తకాలు స్థానంలో మళ్లీ కొత్తగా పాసుపుస్తకాలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. అలాగే వెబ్ ల్యాండ్‌ను పూర్తిగా మార్చుతున్నట్టు తెలిపారు. అలాగే ఈ సర్వేలో జరిగిన తప్పుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో కుక్కల బెడద

రీసర్వే తప్పులు సరిచేయాలి

ఎక్కువగా ఉందని, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, కావున వాటి బెడదను నిర్మూలించాలని సంతోషపురం, రావుపల్లి సర్పంచులు అంబటి తవిటినాయుడు, రాంబాబు అధికారులకు కోరారు. ఈవిషయంపై ఇఒపిఆర్‌డి గోపాలరావు మాట్లాడుతూ కుక్కలను శాశ్వతంగా నిర్మూలించే అధికారం తమకులేదన్నారు. ఏది ఏమైనాప్పటికీ గ్రామాల్లో కుక్కల బెడదను నిర్మూలించేందుకు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని ఎంపిపి అన్నారు. ఎఒ రేగిడి విజయభారతి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన వరి విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంపిపి, రావివలస ఎంపిటిసి సభ్యులు కోట భరత్‌కుమార్ మాట్లాడుతూ గరుగుబిల్లి, పెదబుడ్డిడి గ్రామాలకు ఆర్టీసీ బస్సులను అర్ధాంతరంగా నిలుపుదల చేయడం పట్ల తీవ్ర అసంతప్తి వ్యక్తం చేశారు. సుంకి గ్రామంలో మధ్యాహ్న భోజనానికి వంట శాల నిర్మించాలని సర్పంచ్ కరణం రవీంద్ర కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఇంచార్జి ఎంపిడిఒ నాలి అర్జునరావు, గరుగుబిల్లి, రావివలస పిహెచ్‌సిల వైద్యాధికారులు డాక్టర్ ఎస్ సంతోష్ కుమార్, డాక్టర్ కె,కార్తీక్, ఎంఇఒ నగిరెడ్డి నాగ భూషణరావు, విద్యుత్ శాఖ ఎఇ బొంతాడ శంకర్రావు, జెఇలు గోపీ, గౌరీ శంకర్రావు, అంబటి ప్రవీణ్ సాగర్, పలుశాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారంలో జాప్యమెందుకు? : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్య పరిష్కారంలో అధికారుల జాప్యమెందుకోనని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. మండలంలోని కోటిపాం హైస్కూల్లో తొలగించిన మధ్యాహ్నం భోజన పథక కార్మికులతో కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను మంగళ వారం కలిశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ మిడ్ డే మీల్స్ కార్మికుల సమస్య కాదు రాజకీయ సమస్యగా రోజురోజుకు ఉత్పన్నమవుతున్న పరిస్థితి ఉందని అన్నారు. ఇప్పటికైనా మిద్దె మీల్స్ కార్మికుల సమస్య పరిష్కారంలో విద్యా కమిటీ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పాత వారు తప్పు చేస్తే వెంటనే తొలగించాలని, కొత్త వారికి వేయాలనుకుంటే విద్యా కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రుల అనుమతి వెంటనే తీసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సమస్యను రాజకీయంగా చూడకున్నా వెంటనే మిడ్ డే మీల్స్ కార్మికులను నియమించి పిల్లలకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఎంఇఒ మాట్లాడుతూ బుధవారం హెచ్ఎం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా కమిటీ సమక్షంలో సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు సావిత్రమ్మ, సీత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని బాలగొడబ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 50 జోగినాయుడు చెరువులో జెసిబితో కొంతమంది ఆక్రమణదారులు చదును చేస్తున్నారని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఆక్రమణలు అడ్డుకోగా, చదును చేస్తున్న వారు చల్లగా జారుకున్నారు. మండలంలో పలుచోట్ల యథేచ్ఛగా కొనసాగుతున్న చెరువుల ఆక్రమణను రెవెన్యూ అధికారులు, చెరువులు పరిరక్షణ సమితి సభ్యులు జోక్యం చేసుకుని అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామ పంచాయతీల్లోని కాలువల్లో పూడిక తీత, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు చేయిస్తున్నామని ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే ఇటిక, పెదబుడ్డిడి, అంకవరం, శిఖబడి, గెడ్డతిరువాడ, ఆర్నాడ, పెద మేరంగి తదితర గ్రామాల్లో పూడిక తీతను చేపట్టినట్లు ఎంపిడిఒ తెలిపారు. అంతేకాక గిరిజన గ్రామాలైన అర్నాడ, ఆర్నాడ వలస, డంగభద్ర, డంగభద్ర వలస, ఏనులగూడ, బొడ్డవలస, తుమ్మిగూడ తదితర గ్రామాల్లో ఫాగింగ్ చేయించి, యాంటీలార్వా నివారణకై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

20న మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండువలో శిరిడి సాయిబాబా ధ్యాన మందిరంలో ఈనెల 20న మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఎం.సింహాచలం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ వారిచే జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చినవారు ఆరోగ్యశ్రీ, ఆధార్డ్, ఇతర గుర్తింపు కార్డులైన బ్యాంక్ ఖాతా పాస్ బుక్, ఫోన్ నెంబరు, రెండు జతలు బట్టలు, కంచుము, గ్లాసు, తీసుకురావాలని కోరారు.

ర్యాలీలో పాల్గొన్న డిఇఒ పగడాలమ్మ

'నేను బడికి పోతా' ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మన్యం జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సెయింట్ పీటర్ స్కూల్ నుంచి పలు పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థినీ, విద్యార్థులతో ప్లే కార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మెయిన్ రోడ్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ బడీడు నిండిన ప్రతి ఒక్కరూ పాఠశాలలో చేరి చదువుకోవాలని, అందుకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. ఈ ర్యాలీలో అందరూ చదవాలి, అందరూ ఎదగాలి, బడి మనది బాధ్యత మనది, పెద్దలు పనిలో... పిల్లలు బడిలో అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు సామల సింహాచలం, కె ప్రసాదరావు, విద్యా శాఖ నుంచి ఏగిరెడ్డి శంకర్రావు, సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన రైతులకు అందిస్తున్న రాయితీ వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎ.వి.నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కురుపాం రైతుభరోసా వద్ద రైతులకు రాయితీపై వరి విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులకు 90 శాతం రాయితీతో వరి విత్తనాలను అందజేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని తెలిపారు. ఇప్పటివరకు మండలంలో మొదటి విడతలో 1090.6 క్వింటాల విత్తనాలను 1,864 మంది రైతులకు అందజేశామని, రెండో విడత మరో 80.2 క్వింటాల విత్తనాలు రావాల్సి ఉందని ఆ విత్తనాలు కూడా వస్తే పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మౌనిక, రైతులు పాల్గొన్నారు.

వెల్నెస్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గ్రామీణ ప్రాంత ప్రజలకు హెల్త్ వెల్నెస్ కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు సూచించారు. మండలంలోని గంగాపురం, చినబొండపల్లి హెల్త్‌వెల్నెస్ కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజూ ఆరోగ్య సమస్యలు ఉన్న వారు ఇక్కడ వైద్య సేవలు వినియోగించుకుంటున్నారు. వారికి నిర్వహిస్తున్న పరీక్షలు ఆరోగ్య తనిఖీల వివరాలు రికార్డులో పరిశీలించారు. జ్వర లక్షణాలతో ఉన్న వారికి జాప్యం లేకుండా వెంటనే నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. మలేరియా, డెంగీ తదితర సీజనల్ జ్వరాలు గుర్తిస్తే జ్వరం తగ్గేవరకు పర్యవేక్షిస్తూ ఆ ప్రదేశంలో నివారణా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరోజూ ప్రజలు డ్రైడే పాటించేలా చైతన్య పర్చాలన్నారు. వెల్నెస్ కేంద్రాల్లో ఉన్న వైద్య సేవలు ఆ పరిధిలో ఉండే ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఆరోగ్య తనిఖీ వివరాలు రికార్డుల్లో పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు జయగౌడ్, కృష్ణ, వైద్య సిబ్బంది పద్మావతి, భారతి, కమల, ధనలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లును మంగళవారం అందజేశారు. మాజీ వైస్ ఎంపిపి గొట్టాపు గౌరి, ఎంపిటిసి సభ్యులు ఏగిరెడ్డి తవిటి నాయుడు చేతులమీదుగా ప్రధానోపాధ్యాయులు వెంకట నాయుడు ఈ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ అందించిన పథకాలను అవకాశంగా మల్చుకొని చదువుల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణ, బివి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంఇఒ సూర్యచంద్రరావు చేతుల మీదుగా మంగళవారం విద్యార్థులకు టెక్స్, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు నెల్లి సత్యనారాయణ పెన్నులు, నోట్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులకు దగ్గరుండి పాఠాలు బోధించారు. గ్రామాల్లోకి వెళ్లి అవగాహన కల్పించారు.

ఎఎంసి మాజీ చైర్మన్‌కు కడసారి వీడ్కోలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలం లోని ములగకు చెందిన వైసిపి జిల్లాఉపాధ్యక్షులు, ఎఎంసి మాజీ చైర్మన్ భీమవరపు కృష్ణమూర్తి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మరణించారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్వగ్రామంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీ పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో తుది వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల, పట్టణ పార్టీల అధ్యక్షులు, నియోజకవర్గ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచులు, ఎంపిటిసిసభ్యులు, కార్యకర్తలు ఉన్నారు.

కృష్ణమూర్తికి నివాళ్లు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, వైసిపి నాయకులు

ఎట్టకేలకు కాంప్లెక్స్ రోడ్డు నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఏర్పాటై దాదాపు 30 ఏళ్ల తర్వాత రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. కాంప్లెక్స్ పరిసర ప్రాంతంలో ఉన్న రోడ్డు పూర్తిగా పాడై రాళ్లు తేలడంతో ప్రయాణికులు నడవడానికి ఇబ్బందిగా మారింది. దీనిపై చాలాసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు.